క్లుప్తంగా

ఈ స్టాంపింగ్ సేవలను వినియోగించుకోండి

కోవెలకుంట్ల: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఈ స్టాంపింగ్ సేవలను వినియోగించుకోవాలని సబ్ రిజిస్టర్ సర్వేశ్వరనాథ్ తెలిపారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో ఈ స్టాంపింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్‌జ్యుడిషియల్ స్టాంపుల స్థానంలో ఈ స్టాంపింగ్ చేయించుకోవడం సులభతరమన్నారు. వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు సమర్పించే డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు, తదితర వాటికి ఈ స్టాంపింగ్ తప్పనిసరన్నారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకుడు భాస్కర్ పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు రూ. లక్ష విరాళం



దాతలకు రసీదును అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణంలో ఏర్పాటు చేయనున్న స్వామి వివేకానంద విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కోసం మొదటి వ్యక్తిగా వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్ శారద దంపతులు రూ. లక్ష అందజేశారు. ఈ మేరకు గురువారం సేవా సమితి గౌరవ అధ్యక్షులు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు, సభ్యులు విజయభట్టు, శ్రీనివాసులు తదితరులు శుక్రవారం దాతల ఇంటికి వెళ్లి రసీదులను అందజేశారు.

రక్తదానం చేయండి

బనగానపల్లెరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని బనగానపల్లె ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వలంటరీ బ్లడ్ డొనేషన్ క్యాంప్ జరిగింది. వైద్యులు, సిబ్బంది మొత్తం 20 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు లేనందున అవసరార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రక్తదాన ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాతలను డాక్టర్ సుజాత అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. డాక్టర్ ఉమాదేవి, బ్లడ్ స్టోరేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య శుక్రవారం తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

కొనసాగిన కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్స్ పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్ : డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్ రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి మూడు వందల మందికి మెరిట్ కార్డులు పంపగా 43మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. డోన్ ఐటీఐలో 18మంది, శ్రీశైలంలో 8 మంది, అవుకు ఐటీఐలో ప్రవేశానికి నలుగురు విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. శనివారం కూడా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్యాపిలి విద్యార్థుల ప్రతిభ

ప్యాపిలి: ఏపీ ఈఏపీ సెట్‌లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో ఎనిమిది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఐదు మంది అర్హత సాధించినట్లు తెలిపారు. కళాశాలకు చెందిన సి. లహరి 36, 906వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. బైపీసీలో మానసం 12,232వ ర్యాంకు, హర్షియా బేగం 21,160వ ర్యాంకు సాధించారన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సిబ్బంది అభినందించారు.

ఘనంగా అమ్మవారి పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఈఓ రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మ వారికి అభిషేకం,అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు.

సన్మానం

డోన్ టౌన్ : మండలంలోని తిమ్మాపురంలోని ఎంపీపీ స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి కమలాపురం గ్రామానికి, మల్లేశ్వరి ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి బదిలీ అయ్యారు. శుక్రవారం వారిని విద్యా కమిటీ చైర్మన్ వరదరాజు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా విద్యా కమిటీ చైర్మన్ చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

సాగుకు సాయం.. అన్నదాత ఆనందం!

- ప్రతి ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం
- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా
- 42 వేల మంది రైతులకు లబ్ధి
- రైతుల ఖాతాల్లో రూ. 23.11 కోట్ల జమ

నియోజకవర్గంలో లబ్ధి పొందిన రైతుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	ఖాతాల్లో జమ
బనగానపల్లె	12,174	రూ. 6.69 కోట్లు
కోవెలకుంట్ల	6,230	రూ. 3.42 కోట్లు
కొలిమిగుండ్ల	6,152	రూ. 3.38 కోట్లు
అవుకు	8,995	రూ. 4.96 కోట్లు
సంజామల	8,451	రూ. 4.64 కోట్లు



ఖరీఫ్‌కు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. విత్తు నుంచి దిగుబడుల విక్రయం వరకు అన్నదాతకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. పాదయాత్ర సమయంలో రైతుల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతు సంక్షేమానికి పెద్దపేట వేశారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసేందుకు రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడికి చేతిలో డబ్బులు లేక అన్నదాత పడుతున్న అవస్థలను గుర్తించి రైతు భరోసా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి కిషాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందే రూ. 6వేలు కలుపుకుని ఒక్కో రైతుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం అందజేస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా ఇటీవలే రైతులకు ఐదవ విడత పెట్టుబడి సాయం విడుదల చేసింది. నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెతోపాటు కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని 42,005 మంది రైతులకు రూ. 23.11 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది ప్రభుత్వం.

పొలం ఉన్న... ప్రతి రైతు అర్హత

రైతు భరోసా పథకానికి పొలం ఉన్న ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా నిర్ణయించింది. ప్రధాన మంత్రి కిషాన్ సమ్మాన్‌నిధి యోజన కింద రూ. 6 వేలు కలుపుకుని రూ. 13,500 పెట్టుబడి సాయాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాల్లో జమ అవుతుంది. ఖరీఫ్‌లో పంట వేసే ముందు మే నెలలో మొదటి విడతలో రూ. 7,500, అక్టోబర్‌లో పంట కోతల సమయంలో రూ. 4వేలు, ధాన్యం ఇంటికి చేరే సమయంలో జనవరిలో రూ. 2వేలు చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. కౌలు రైతులకు మొత్తం పెట్టుబడిసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 21 వేల హెక్టార్లలో పత్తి, వరి, జొన్న, మినుము, వేరుశనగ, కంది, వేరుశనగ, మిరప, పొద్దుతిరుగుడు, ఆముదం, ఉల్లి, మొక్కజొన్న, పెసర, తదితర పంటలు సాగు లక్ష్యం. వివిధ పంటల సాగుకు కావాల్సిన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల కోసం ఒక్కో రైతుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,500 నగదు ఖాతాల్లో జమ చేయగా పీఎం కిషాన్‌కు సంబంధించి రూ. 2వేలు త్వరలో జమ చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

రైతు చనిపోతే ఆ కుటుంబంలో మరోకరికి:

రైతు భరోసా పథకం ద్వారా లబ్ధిపొందే రైతు ఏ కారణంతోనైనా మరణిస్తే ఆ న గదు ఆ కుటుంబంలో మరోకరికి అందుతోంది. రైతు చనిపోతే వెబ్ ల్యాండ్‌లో డేటాను ఆ ఇంట్లోని కుటుంబ సభ్యుల పేరున నమోదు చేసుకోవాలి. రైతు భరోసా కేంద్రంలో పథకం వర్తింపుకు దరఖాస్తుతో పాటు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, చనిపోయిన రైతు మరణ ధృవీకరణపత్రం అందజేస్తే కొత్త రిజిస్ట్రేషన్ కింద నమోదు చేసి రైతు భరోసా పథకాన్ని వర్తింప చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు పెట్టుబడి సాయం అందింది. సొంత భూములు ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు పథకం ద్వారా నగదును జమచేస్తోంది. భూ యజమానులతోపాటు కౌలు కార్డులు(సీసీఎస్) కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు మాత్రమే ఈ పథకం వర్తింపచేశారు.

రైతు భరోసా పథకానికి అర్హులు

- కనీసం అరఎకరా సొంత పొలం కలిగిన రైతులు
- ఉద్యానవన, పట్టుపరిశ్రమకు రైతు భరోసా పథకం వర్తింపు
- కూరగాయలు, పువ్వులు, పశువుల మేత కోసం అర ఎకరం భూమి సాగు చేస్తుండాలి
- ఒకే యజమానికి ఒకరికి మించి కౌలుదారులుంటే వారిలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఒకరికి మించి కౌలుదారులుంటే ఎస్టీలకు పాధాన్యత, ఆ తర్వాత ఎస్సీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం

అనర్హులు...

- వ్యవస్థీకృత భూ యజమానులకు ఈ పథకం వర్తించదు
- మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు పథకం వర్తించదు
- జిల్లా పరిషత్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులకు రైతు భరోసా పథకం వర్తించదు.

ప్రతి ఏటా పెట్టుబడిసాయం



నాకున్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నా. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మిరప, మొక్కజొన్న, శనగ పంటలు సాగు చేస్తున్నాను. ప్రభుత్వం ప్రటి ఏటా సాగుకు ముందే రైతు భరోసా పథకం వర్తింప చేస్తోంది. ఇప్పటి వరకు ఐదు విడదల సాయం అందింది.

– కుళాయప్ప, రైతు, అమదాల, కోవెలకుంట్ల మండలం

పెట్టుబడికి ఇబ్బంది లేదు



నాలుగు సంవత్సరాల నుంచి వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందుతోంది. నాకున్న మూడు ఎకరాల్లో పంటలు పండిస్తున్నాను. ప్రభుత్వం ప్రతి ఏటా మూడు విడతలుగా రూ. 13,500 చొప్పున నగదును ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడతగా రూ. 5,500 నగదు అందింది.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

అర్హత ఉన్న ప్రతి రైతుకు వర్తింపు



పొలం కలిగి ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా పథకం వర్తింప చేస్తున్నాం. సొంత పొలం కలిగిన రైతులతోపాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. ఈ ఏడాది నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 42 వేల మంది రైతులకు రూ. 23.11 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ అయింది. అర్హత ఉండి పథకం వర్తించని రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాం. వారికి త్వరలో పెట్టుబడి సాయం వర్తిస్తుంది.

–నిరంజన్, ఏడీఏ, కోవెలకుంట్ల

విద్యుత్ సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్ 132/33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు ఫ్యాక్టరీలు, మల్కాపురం, యర్ర గుంట్ల, కమలాపురం, ధర్మారం, చింతలపేట, మల్లెంపల్లె, లక్ష్మంపల్లె, గోసానిపల్లె, కొచ్చెర్వుతోపాటు జగదుర్తి సబ్ స్టేషన్‌లలో కింద ఉండే గ్రామాల్లోనూ కరెంటు ఉండదని ఆయన తెలిపారు.

బేతంచెర్ల: విద్యుత్ మరమ్మతులు, రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మూడవ శనివారం మండల వ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూధన్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఆర్ఎస్ రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలు, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పాతపాడు, పసుపల, బనగానపల్లె విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

31 మందికి జగనన్న ఆణిముత్యాలు అవార్డులు

బేతంచెర్ల: మండలంలో 2022–23 సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జెడ్పీ హైస్కూలు, ఏపీ మోడల్, కస్తూర్బా విద్యాలయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన 31 మంది విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల కింద అవార్డులు అందజేయనున్నామని ఎంఈఓ సోమశేఖర్ శుక్రవారం తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ. 3వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహంతో పాటు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాల అవార్డులు అందజేస్తామని తెలిపారు.

రైతన్నలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతులకు రాయితీపై వేరుశనగ, కంది, కొర్ర, మినుము విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో ఏఓ కిరణ్ కుమార్, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామ నాథం ఆధ్వర్యంలో వారు విత్తనాల పంపిణీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతు ముంగిట సేవలు అందించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సబ్సిడీ విత్తనాలను, ఎరువుల సకాలంలో అందజేస్తూ రైతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, బాబు, మురళీ కృష్ణ, అగ్రి కల్చర్ అసిస్టెంట్ మహమ్మద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలు విద్యార్థులకు అభినందనలు



జగనన్న అణిముత్యాలు విద్యార్థులతో ప్రిన్స్‌పాల్ జాస్మిన్

డోన్ టౌన్: ఆణిముత్యాలు అవార్డులు అందుకున్న ఐదుగురు డోన్ మోడల్ స్కూల్ విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ జాస్మిన్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. డోన్ నియోజకవర్గం మొత్తంలో 11 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు కింద ఎంపికవ్వగా డోన్ మోడల్ స్కూల్ నుంచే ఐదుగురు విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతాం అని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, సువర్ణ, వనిత, మాధవి, శ్రీనివాసరావు, సురేంద్ర, ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం జగనన్న విద్యాకానుక



విద్యాకానుక కిట్లను అందజేస్తున్న మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి

ప్యాపిలి: పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక (జేవీకే) వరం లాంటిదని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లిలో శుక్రవారం సర్పంచ్ మహేంద్రమ్మ అధ్యక్షతన జేవీకే కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న విద్యాకానుక ద్వారా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగు, బూట్లు పంపిణీ చేస్తోందన్నారు. అలాగే ప్రభుత్వం నాణ్యమైన మధ్యాహ్న భోజనం, రాగిజావ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గుప్త, ఉపాధ్యాయులు చిన్నపరెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీదేవి, వార్డు మెంబర్లు లోకేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వీడీ వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మద్రికుంట తండా గ్రామస్తులు

బనగానపల్లెరూరల్: అవుకు మండలం మద్రికుంట తండా గ్రామం టీడీపీకి చెందిన గోపాల్‌నాయక్, బాలునాయక్, లక్ష్మానాయక్, వెంకటేష్‌నాయక్, రమేష్‌నాయక్ కుటుంబాలు ఆ పార్టీ వీడీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌పీపీలో చేరిన వారికి పార్టీ కండువేసి ఎమ్మెల్యే కాటసాని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయన్నారు. దీంతో టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన ఎంతో మంది సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు 2024లో జరిగే ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన న్యాయం చేస్తామని, సముచితస్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే కాటసాని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కునుకుంట్ల గ్రామ సచివాలయ కన్వీనర్ పురుషోత్తం నాయుడు, మద్రికుంట తండా వైఎస్సార్‌సీపీ నాయకులు కంబగిరి రాముడునాయక్, లక్ష్మానాయక్, రాముడునాయక్, రామాంజి నాయక్, పుల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

అవుకు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు బీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని అవుకు పశువైద్యురాలు భారతీదేవి తెలిపారు. శుక్రవారం డాక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకాన్ని ప్రస్తుతం పశు బీమా పథకం కింద అమలు చేస్తున్నామన్నారు. గతంలో పరిమితి ఉండేదని, ప్రస్తుతం ప్రతి పశువుకు బీమా వర్తిస్తుందని తెలిపారు. పశుబీమా పథకం వర్తింపునకు ప్రతి పాడిరైతులు, గొర్రెల పెంపకదారులు ఆర్బీకేలు, స్థానిక పశువైద్యశాలల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

అన్నిరంగాల అభివృద్ధే లక్ష్యం

- క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణానికి భూమి చేసిన ఎమ్మెల్యే కాటసాని



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె నియోజకర్గంలో అన్నిరంగాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని బీసీ బాలికల వసతి గృహం సమీపంలో శుక్రవారం పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో వ్యాపార రంగం దినదినాభివృద్ధి చెందుతుందని, ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఆర్యవైశ్యులకు సంపూర్ణ సహకారం అందజేస్తామన్నారు. ఆర్యవైశ్యుల విన్నపం మేరకు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవన నిర్మాణానికి విలువైన ఐదుసెంట్ల స్థలాన్ని ఉచితంగా కేటాయించామని, ఆరు నెలల్లో భవనాన్ని కూడా ప్రారంభిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పేదల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన మండిమర్చంట్ అసోసియేషన్ భవనం నిర్మాణం నిలిచిపోయిందని, ప్రత్యేక చొరవ తీసుకుని అనుమతులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఈ భవన నిర్మాణ పనులు పూర్తికావచ్చాయని వివరించారు. పట్టణ క్లాత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారం మరువమన్నారు. పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘం నాయకులు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, పట్టణ ఈఓ ఖలీల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ రవికుమార్, గాథంశెట్టి వేనుగోపాల్, పసుపల సుబ్బసత్యనారాయణ, నూకల వెంకట సుబ్బయ్య నూకల విజయకుమార్, గాథంశెట్టి మోహన్, ఎస్ఎస్ఎం సత్యనారాయణ, చక్రపాణి, గోపాల్, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, న్యాయవాది మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఫైజ్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మహబూబ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా స్వాధీనం

అవుకు(కొలిమిగుండ్ల): కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ఎరుకల గంగన్న, ఎరుకల రమణయ్య శుక్రవారం పట్టణంలో నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని, 50 లీటర్ల నాటుసారాను సీజ్ చేశామని తెలిపారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ గఫూర్, హోంగార్డు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృత దేహం లభ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ నీటి గుండంలో గురువారం ప్యాపిలి మండలం పెద్ద పూజర్ల గ్రామానికి చెందిన వల్లె భాస్కర్ (45) గల్లంతయిన విషయం తెలిసిందే. బేతంచెర్ల ఎస్ఐ శివ శంకర్ నాయక్, డోన్ విపత్తుల నివారణ కేంద్రం ఎస్ఐ రంగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం గాలింపు చేపట్టగా మృత దేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బనగాపల్లెకు తరలించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోవెలకుంట్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పెన్నా నది నుంచి ట్రాక్టర్లలో ఇసుకను నింపుకుని కోవెలకుంట్ల వైపు వస్తుండగా అందిన సమాచారం మేరకు సెబ్ ఎస్ఐ రమేష్ తమ సిబ్బందితో దాడి చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన పరశు రాముడు రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రునికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు

ప్యాపిలి: రైతులకు సంబంధించి వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శుక్రవారం సబ్‌స్టేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈ రమణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ట్రాన్స్‌కో డీఈ మాట్లాడుతూ పోతుదొడ్డి గ్రామంలో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా 33–11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మొత్తం నాలుగు ఫీడర్లకు గాను మూడింటికి ఉదయం 8 నుంచి 5 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పోతుదొడ్డి కృష్ణమూర్తి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం



గుంజలపాడులో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహబూబ్‌సుభాని

కోవెలకుంట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల చెంతకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్‌సుభాని అన్నారు. శుక్రవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుంజలపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు– నేడు కార్యక్రమంతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారిపోయాయన్నారు. వైద్యశాలలకు ఆధునాతన వైద్య పరికరాలు, మందులు సరఫరా కావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉస్మా, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల పాత్ర కీలకం



సీతారామాపురం, శంకరాపురం వలంటీర్లను సత్కరిస్తున్న, ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు



గోరుమానుకొండలో వలంటీర్లను సత్కరిస్తున్న, దృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కీలకంగా మారిందని, వలంటీర్లు ప్రభుత్వ రథసారథులుగా నిలిచారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారామాపురం, శంకరాపురం, గోరుమాను కొండ గ్రామాల్లో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌లు చిట్టి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు రామనాథం, సుబ్బమ్మ పంచాయతీ కార్యదర్శులు మహేష్, షఫీ, మహబూబ్ బాషా సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ వలంటీర్లకు పురస్కారాలు, మెడల్స్ అందజేసి శాలువలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ సీఎం తీసుకవచ్చిన వలంటీర్ వ్యవస్థ పరిపాలనలో విప్లవానికి నాందిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు జయ ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, రామ చంద్రుడు, నక్కల బ్రహ్మం, ఎద్దులన్న, తిరుమలేశ్వర్‌రెడ్డి, రామనాయుడు పాల్గొన్నారు.